TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

జాతీయ తెలుగు దిన పత్రిక

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISH IN TELANGANA సంపుటి : 1 సంచిక: 12 5-6-2025 గురువారం పేజీలు : 4 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## జులై 21 నుంచి

## పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు



న్యూ ఢిల్లీ,(సందేశం టైమ్స్): పార్లమెంట్ వర్షాకాల సమావేశాల షెడ్యూల్ విడుదలైంది. జూలై 21 నుంచి ఆగస్టు 12 వరకు సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బుధవారం ప్రకటించారు. మూడు నెలల విరామం తర్వాత ఉభయ సభలు ప్రారంభం అవుతున్నాయి. పార్లమెంట్, రాజ్యసభ ఉదయం 11 గంటలతో సమావేశాలు ప్రారంభం కానున్నాయి.పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జనవరి 31న ప్రారంభమై ఏప్రిల్ 4న ముగిశాయి. అనంతరం ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఇక వర్షాకాల సమావేశాల్లో విధానపరమైన అంశాలు, పెండింగ్‌లో ఉన్న చట్టాలు, రాజకీయ పరిణామాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది.పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై భారతప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. అయితే ఈ పరిణామాలపై చర్చించేందుకు ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్.. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. కానీ అందుకు కేంద్రం అంగీకరించలేదు. దీంతో ఈ అంశాలపై కేంద్రాన్ని ప్రతిపక్షం నిలదీసేందుకు సన్నద్ధమవుతోంది. అయితే అన్ని విషయాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కిరణ్ రిజిజు తెలిపారు.ఇదిలా ఉంటే ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులు సభలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా పాకిస్థాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రక్షణ రంగం కోసం సప్లిమెంటరీ బడ్జెట్‌ను కూడా ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. భారీగా బడ్జెను రెట్టింపు చేసి రక్షణ రంగాన్ని మరింత ప్రోత్సహించాలని కేంద్రం అలోచిస్తునట్లు సమాచారం

మిగతా 2లో...

## తెలంగాణ

## టెట్ షెడ్యూల్ విడుదల




## ఇథనాల్? కంపెనీ మాకొద్దు..

## వ్యతిరేకిస్తూ రైతుల ఆందోళన



హైదరాబాద్?, (సందేశం టైమ్స్): జోగులాంబ గద్వాల జిల్లాలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. రాజోలు మండలం పెద్ద ధన్వాడలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పెద్ద సంఖ్యలో రైతులు ఆందోళన చేపట్టారు. గుట్టుచప్పుడు కాకుండా పనులు ప్రారంభించేందుకు కంపెనీ యత్నించడంతో రైతులు ఆందోళన బాటపట్టారు. ఈ క్రమంలో పలు గ్రామాలకు చెందిన రైతులు ఫ్యాక్టరీ వ్యతిరేక ఆందోళన చేపట్టారు.

మిగతా 2లో...

## పల్లెల్లో విడతల వారిగా

## ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం.. ఎమ్మెల్యే బొజ్జు పటేల్



జన్నారం, (సందేశం టైమ్స్): పల్లెల్లో తిరిగి పేదవారికి విడతల వారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని ఎంపీడీవో సమావేశమాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పత్రాలను బుధవారం ఆయన అందజేశారు. ఆ తర్వాత పొనకల్ సింగిల్ విండో కార్యాలయంలో జీలుగా, వేలు రకమైన వడ్ల విత్తనాలను ఆయన పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదన్నారు. మొదటి విడతగా నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేశామని, గ్రామాల్లోని అర్హులంతా అధైర్య పడకూడదని, తమ ప్రభుత్వం ఇండ్లు లేని అర్హులందరికీ తప్పకుండా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ఆయన తెలిపారు. ప్రజలంతా తన వెంట ఉంటే అభివృద్ధికి ఆటంకం కలుగజేస్తున్న అటవీశాఖ చెక్ పోస్ట్ లను తొలగించడానికి వెనుకాడబోనని ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ళను వీలైనంత తొందరగా కట్టుకున్న లబ్ధిదారులను సన్మానించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జనార్ధన్, ఎంపీడీవో హుమర్ షరీఫ్, జన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ సయ్యద్ ఫసిహుల్ల, పోనకల్ సింగల్ విండో చైర్మన్ అల్లం రవి, తదితరులు పాల్గొన్నారు.

మిగతా 2లో...

## గాంధీ భవన్ కు

## భద్రత పెంపు..





(సందేశం టైమ్స్): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయమైన గాంధీ భవన్ వద్ద భద్రతను అధికారులు పెంచినట్లు సమాచారం. ఇటీవల రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ పై ఊహాగానాలు ఊపందుకున్న నేపథ్యంలో, మంత్రి పదవికి ఆశించి నిరాశ చెందిన ఆశావహులు ఆందోళనలకు దిగే అవకాశాన్ని ఇంటెలిజెన్స్ అధికారులు హెచ్చరించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యగా గాంధీ భవన్ వద్ద పోలీస్ బందోబస్తును పెంచినట్లు తెలుస్తోంది.

మిగతా 2లో...

## రక్షణ ఇవ్వండి..

## నిజాలు బయటపెడతా..

## ఫోన్ ట్యాపింగ్‌పై నందకుమార్



హైదరాబాద్, (సందేశం టైమ్స్) : రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్‌పై ఎమ్మెల్యేల కొనుగోలు కేసు నిందితుడు నంద కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు.2022 ఎమ్మెల్యేల కొనుగోలు కేసులు నందకుమార్ నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తన ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని.. ఈ విషయంపై అప్పటి డీజీపీ రవి గుప్తాకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలుద్దామని అనుకున్నానని.. కానీ అపాయింట్‌మెంట్ దొరకలేదని అన్నారు. నందకుమార్ మాట్లాడుతూ.. అప్పటి ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్ రావు చెబితేనే తన ఫోన్ టాప్ చేసినట్టు రాధా కిషన్ రావు కన్ఫ్యూషన్ స్టేట్మెంట్‌లో చెప్పారన్నారు.తన ఫోన్ ట్యాప్ చేశారని రాధా కిషన్ రావు స్టేట్‌మెంట్‌తో క్లియర్‌గా తేలిందన్నారు. పక్కా సమాచారం ఉన్నా పోలీసులు ఆధారాల కోసం మూసీలో వెతికారన్నారు. ప్రభాకర్ రావు విచారణ తర్వాత ఎవరికి ఫిర్యాదు చేయాలో వాళ్లకి చేస్తానని..

మిగతా 2లో...

## రాజకీయ కక్షతోనే కెసిఆర్ కు

## నోటీసులు ... ఎమ్మెల్సీ కవిత




హైదరాబాద్ %-% రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత . తెలంగాణకు నీళ్లు, నిధులు తీసుకురావటం కేసీఆర్ చేసిన తప్పా అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మూడు బ్యారేజులు కాదని.. 21పంపు హౌస్‌లు, కాళేశ్వరంతో 35శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు వస్తున్నాయని అన్నారు.కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులకు వ్యతిరేకంగా ఇందిరాపార్క్ వద్ద జాగృతి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత ధర్నా నిర్వహించారు.

## మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి కన్నుమూత

## సంతాపం తెలిపిన రేవంత్

హైదరాబాద్,(సందేశం టైమ్స్) : మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి గుండెపోటు తో మరణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డికి ఆయన సన్నిహితులుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకసారి ఎమ్మెల్సీగా ఆయన ఎన్నికయ్యారు. ఇక రంగారెడ్డి మృతి నేపథ్యంలో రాజకీయ నాయకులు అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి గారి మరణం బాధాకరం అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకునా ప్రగాఢ సానుభూతి అని పేర్కొన్నారు.



## అపోహలొద్దు..

## చలామణిలోనే రూ.500 నోట్లు



హైదరాబాద్,(సందేశం టైమ్స్): నోట్ల రద్దు అంటేనే ప్రజల్లో ఒక భయం పుడుతుంది. తాజాగా రూ.500 నోటు రద్దు చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో చాలా మంది ప్రజల్లో భయాం దోళనలు మొదలయ్యాయి. ఇప్పటికే అన్ని బ్యాంకులకు ఆర్బీఐ కీలక ఆదేశాలు ఇచ్చిందని, బ్యాంకులు తర్వాత రూ.500నోట్ల సరఫరా తగ్గించాలని, ఏటీఎంలలో కూడా రూ.500 తగ్గిస్తూ.. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి అసలు రూ.500 నోటు కనిపించకుండా చేయాలని ఆర్బీఐ బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.దీనిపై ఆర్బీఐ వివరణ ఇచ్చింది.. అన్ని ఏటీఎంలలో 2025 సెప్టెంబర్ 30 నాటికి 75శాతం, 2026 మార్చి 31నాటికి 90శాతం రూ.100 లేదా రూ.200 నోట్లను పంపిణీ చేయాలని బ్యాంకులు, వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లను ఆదేశించింది ఆర్బీఐ. రోజువారీ లావాదేవీలకు అధిక డిమాండ్ ఉన్న సాధారణంగా ఉపయోగించే నోట్లను ప్రజలకు అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా ఈ చర్య తీసుకున్నామని ప్రకటించింది.. అంతేకానీ, రూ.500నోట్ల రద్దు ఉండదని పేర్కొంది.

# ఇథనాల్? కంపెనీ మాకొద్దు.. వ్యతిరేకిస్తూ రైతుల ఆందోళన

ఫ్యాక్టరీ పనులను అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గాయత్రి ఇథనాల్ కంపెనీకి చెందిన కార్లు, టెంట్లను రైతులు ధ్వంసం చేశారు. పరిశ్రమకు చెందిన టెంట్లు, కంటైనర్ డబ్బాలకు రైతులు నిప్పుపెట్టారు.పనుల్లో ఉన్న వర్కర్స్‌ని తరిమికొట్టిన రైతులుకంపెనీ నిర్మాణ పనులు చేయిస్తున్న కూలీలను రైతులు తరిమికొట్టారు. ఆందోళన చేస్తున్న రైతులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. రైతులు ఆందోళన చేపట్టనున్నారన్న సమాచారం ముందస్తుగా పోలీసులు సంఘటనా స్థలం పోలీసులు మోహరించినా.. రైతులు భారీ సంఖ్యలో ఉండడంతో వారిని పోలీసులు నిలువరించలేకపోయారు. కంపెనీకి చెందిన స్థలంలో ఉన్న వాహనాలను సైతం రైతులు ధ్వంసం చేశారు. మూడు నెలల కిందట కంపెనీ ఉండదని చెప్పిన యాజమాన్యం.. మళ్లీ పనులు మొదలుపెట్టేందుకు ఉపక్రమించడంతో పది గ్రామాల రైతుల ఆందోళన చేపట్టారు.

విషయం చిమ్మే ఫ్యాక్టరీలు..

ఆరునెలలుగా 12 గ్రామాల ప్రజల్కెన క్యాన్సర్ కారకాలు, విషాన్ని చిమ్మే పెట్టే ఫ్యాక్టరీని నిర్మించొద్దంటూ నిరసన నిరహార దీక్షలు కొనసాగించినట్లు పేర్కొంది. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ అలంపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి సంపత్ కుమార్ హామీతో దీక్షలు విరమించామని గుర్తు చేసింది. అర్ధరాత్రి దొంగ దెబ్బ తీస్తారని ఊహించలేదని పేర్కొంది. ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి, శాంతియుతంగా పోరాడుతున్న సమయంలో ప్రజలపై దాడి చేసేందుకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే దురుద్దేశంతో ప్రైవేట్ సైన్యాన్ని మోహరిస్తూ ఫ్యాక్టరీ యాజమాన్యం ఏం కోరుకుంటుందని.. ప్రజల సహనాన్ని పరీక్షించడం దేనికి సంకేతమని ప్రశ్నించింది.

# తెలంగాణ టెట్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్ - తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) 2025 పరీక్షల షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ పరీక్షలు జూన్ 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా రెండు షిఫ్ట్‌ల్లో జరగనున్నాయి. పరీక్షలు రెండు పేపర్లుగా - పేపర్-1, పేపర్-2 విభజించబడ్డాయి. అభ్యర్థుల సౌలభ్యం కోసం జిల్లాల వారీగా పరీక్షల తేదీలు, సబ్జెక్టులు కేటాయించబడ్డాయి.

పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఒక షిఫ్ట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు మరో షిఫ్ట్‌లో జరుగుతాయి. పేపర్-1ను రాయబోయే అభ్యర్థులు, ఐదో తరగతి వరకు బోధించాలనుకునే వారు కాగా, పేపర్-2ను రాయబోయే వారు ఆరో తరగతి పైగా బోధించాలనుకునే అభ్యర్థులు. పేపర్లు ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఉండగా, కొన్ని సబ్జెక్టులకు హిందీ, కన్నడ, తమిళం, ఉర్దూ, మరాఠీ, బెంగాలీ, సంస్కృతం మాధ్యమాలకూ అవకాశం కల్పించారు. జూన్ 18న ప్రారంభమయ్యే టెట్ పరీక్షలు మొదటగా మాథమెటిక్స్ సైన్స్ (పేపర్-2) పరీక్షతో ప్రారంభమవుతాయి. వరుసగా 16 సెషన్లలో వివిధ సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించనున్నారు. చివరి రోజైన జూన్ 30న మైనారిటీ భాషల్లో పేపర్-2 మాథమెటిక్స్, సైన్స్ సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నాయి.ప్రతి జిల్లాలోని కేంద్రాలను స్పష్టంగా పేర్కొంటూ, సంబంధిత సబ్జెక్టుల పరీక్షలు ఏ తేదీన జరిగేలా కేటాయించారో విద్యార్థులకు వెల్లడించారు. నల్గొండ, ఖమ్మం, హైదరాబాద్, వరంగల్, సిరిసిల్ల, మంచిర్యాల, ములుగు, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, జగిత్యాల, పటాన్‌చెరు, సంగారెడ్డి వంటి జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు షెడ్యూల్‌లో తెలిపారు.

ఈ షెడ్యూల్ ప్రకారం పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు తమ జిల్లాకు అనుగుణంగా తేదీలను గమనించి సన్నద్ధం కావాలని అధికారులు సూచించారు. త్వరలో హాల్‌టికెట్లు విడుదల కానుండగా, అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పాఠశాల విద్యాశాఖ పేర్కొంది.

# రాజకీయ కక్షతోనే కెసిఆర్ కు నోటీసులు ...

## ఎమ్మెల్సీ కవిత

ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ ధర్నా కొనసాగింది. ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో జాగృతి కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో కవిత మాట్లాడుతూ, నీళ్లు ఇచ్చిన కేసీఆర్‌కు.. రేవంత్ ప్రభుత్వం నోటీసులు ఇవ్వడాన్ని సహించబోమని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి తన గురువు చంద్రబాబు ఏపీకి గోదావరి జలాలను తరలించుకుపోతుంటే.. మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఆపమని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసే ధైర్యం రేవంత్‌రెడ్డికి లేదా అని నిలదీశారు.వెంటనే రేవంత్‌రెడ్డి.. అపెక్స్ కౌన్సిల్, కేంద్రానికి లేఖ రాయాలని కోరారు. కాళేశ్వరం లాంటి పెద్ద ప్రాజెక్టులు కట్టినప్పుడు చిన్న సమస్యలు సాధారణమేనని తెలిపారు. కుంగిన మేడిగడ్డ పిల్లర్‌కు రిపేర్ చేయాలని కోరారు. 21కి గానూ.. 20 పంపు హౌస్‌లు మెగా కృష్ణారెడ్డి కట్టారని గుర్తుచేశారు. మెగా కృష్ణారెడ్డిని కాళేశ్వరం కమిషన్ విచారణకు పిలిచే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఆయనను విచారణకు ఎందుకు పిలవటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు కవిత.ఏపీ సీఎం చంద్రబాబు మీద ఆధారపడి బీజేపీ.. కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపుతోందని కవిత ఆరోపించారు. అందుకే కేంద్రమంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బనకచర్ల ప్రాజెక్ట్ గురించి మాట్లాడటం లేదని మండిపడ్డారు. తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ అయినా ఈ విషయంపై మాట్లాడాలని కోరారు. రైతులు, జాగృతి తరుపున మాట్లాడాలని ఈటలకు విజ్ఞప్తి చేశారు. నోరు కట్టేసుకుని అపవాదు తెచ్చుకోవద్దని ఈటలను కోరారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఈటల రాజేందర్ ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని కోరారు.గోదావరిలో వెయ్యి టీఎంసీల నీళ్లు వచ్చేవరకు జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని ప్రకటించారు. దీంతో హైదరాబాద్‌కు శ్వాశతంగా నీటి అవసరాలు తీరుతాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడించారు. కేసీఆర్‌ది గట్టి గుండె కాబట్టే.. కాళేశ్వరం కట్టారని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ కలలో కూడా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టు కట్టలేదని ఎద్దేవా చేశారు. ప్రాణహిత చేవెళ్ల పేరుతో.. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16టీఎంసీలు మాత్రమే తెలంగాణకు కేటాయించారని వివరించారు. కేసీఆర్ 141 టీఎంసీలు తెలంగాణకు నిల్వ ఉండాలని కాళేశ్వరం కట్టారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేశారని విమర్శించారు.

# గాంధీ భవన్ కు భద్రత పెంపు..

త్వరలో మంత్రివర్గ విస్తరణ తెలంగాణ రాష్ట్రంలో త్వరలో మంత్రివర్గ విస్తరణ జరగనుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే కొన్ని నియోజక వర్గాల నుంచి బలమైన ఆశావహులు మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. అయితే, వారికి పదవి లభించకపోతే వారి వర్గీయులు అసంతృప్తిని వ్యక్తం చేయవచ్చని, ఆందోళనకు దిగే అవకాశమున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో గాంధీ భవన్ వద్ద ఉద్రిక్తతలు ఎదురవకుండా ముందుగానే పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.గాంధీ భవన్ పరిసరాల్లో పోలీసుల బందోబస్తు ఇప్పటికే గాంధీ భవన్ పరిసరాల్లో పోలీసుల సంఖ్యను పెంచడంతో పాటు, సీసీ టీవీ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా భవన్‌లోకి ఎవరినీ అనుమతించకుండా నిర్బంధాలు పెట్టారు. ఆశావహుల నిరసనలు, అధిష్టానం మీద ఒత్తిడి పెంచే ప్రయత్నాల నేపథ్యంలో, పార్టీ వ్యవహారాలు శాంతియుతంగా కొనసాగేందుకు భద్రత పెంపు అవసరమైందని అధికారులు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ అధిష్టానం కూడా పరిస్థితిని సమీక్షిస్తూ, శాంతి భద్రతలు దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకుంటోంది.

# రక్షణ ఇవ్వండి.. నిజాలు బయటపెడతా..

## ఫోన్ ట్యాపింగ్‌పై నందకుమార్

తన ఫోన్ ట్యాప్ చేయడానికి ఇంటలిజెన్స్ అధికారులు ఎవరి అనుమతి తీసుకున్నారని ప్రశ్నించారు. తన ఫోన్ ట్యాప్ చేయకుండా తనకు సంబంధించిన ఆడియోలు మాజీ సీఎం కేసీఆర్‌కు ఎలా దొరికాయని నిలదీశారు. తాను రోహిత్ రెడ్డి మాట్లాడిన మాటలు కాల్ రికార్డింగ్ కావచ్చని.. కానీ సింహయాజి స్వామితో మాట్లాడిన కాల్స్ కూడా రికార్డింగేనా అని అడిగారు. ఫాం హౌస్ కేసు స్టేట్ సెంట్రల్ ఇష్యూ అని.. అందులో తాను బలైనట్లు తెలిపారు.ప్రభాకర్ రావు వచ్చినా కూడా న్యాయం జరగదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆల్రెడీ మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేస్ ఎప్పుడో అయిపోయిందని.. జస్ట్ ఫార్మాలిటీస్ కోసం ప్రభాకర్ రావు ఇండియా వస్తున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ తానే చేయించాను అని ప్రభాకర్ రావు అంగీకరిస్తే కేసు అక్కడితో ముగుసినట్టే అని అన్నారు. ‘నాకు ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులు, మాజీ సీఎం కేసీఆర్ నుంచి ప్రాణహాని ఉంది. నాకు రక్షణ కల్పిస్తే చాలా విషయాలు బయటపెడతా’ అని నందకుమార్ పేర్కొన్నారు.

# మాగంటి గోపినాథ్ శవ రాజకీయాలు..




(సందేశం టైమ్స్): జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ , కాంగ్రెస్ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ కంటతడి పెట్టుకున్నారు. బొరబండకు చెందిన సర్దార్ మరణాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ రాజకీయం చేశారని ఆయన ఆరోపించారు. సర్దార్ ఆత్మహత్య చేసుకున్నా.. తానే కారణమన్నట్లుగా ఎమ్మెల్యే ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనపై దాడి చేయించేందుకు గోపీనాథ్ ప్రయత్నించారని ఆరోపించారు. సర్దార్ మరణానికి తాను కారణం కాదని అంతిమ యాత్రకు వెళ్లాలని అనుకున్నా.. శాంతి భద్రతలకు సమస్య అవుతుందని పోలీసులు వద్దని చెప్పారని ఫిసియుద్దీన్ వివరించారు.మాగంటి గోపినాథ్ శవ రాజకీయాలు..ఈ సందర్భంగా బుధవారం ఫసియుద్దీన్ మీడియాతో మాట్లాడారు. సర్దార్ తనకు దగ్గరి వాడని .. అతని మరణం తనను కలిచి వేసిందని అన్నారు. సర్దార్ చనిపోయాడని తెలియగానే వెళ్లాలనుకున్నానని, కానీ అక్కడ తనను చంపేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్దార్ ప్రమాదవ శాత్తు చనిపోయాడని పోలీసులు రిపోర్ట్ కూడా ఇచ్చారని.. కానీ సూసైడ్ చేసుకున్నాడని ఎమ్మెల్యే మాగంటి అసత్య ప్రచారం చేశారని ఆరోపించారు. మాగంటి గోపినాథ్ శవ రాజకీయాలు చేశారని, తనపై, తన ఇంటిపై మాగంటి దాడి చేయించడానికి ప్రయత్నించారని అన్నారు. తనపై దాడి చేయాలని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించారని అన్నారు. తనపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై నగర కమీషనర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. కొంత మంది రౌడీ షీటర్లతో తనకు ప్రాణ హాని ఉందని.. ప్రభుత్వం భద్రత కల్పించాలని కోరుతున్నానని ఫసియుద్దీన్ అన్నారు.

కాగా హైదరాబాద్‌లోని బోరబండ డివిజన్ బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ సర్దార్ (33) ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. బాబా ఫసియుద్దీన్ దంపతుల వేధింపులతోనే సర్దార్ ఆత్మహత్యకు పాల్పడ్డారంటూ బంధువులు, బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బోరబండ ప్రాంతంలో, ఫసియుద్దీన్ నివాసం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్దార్ సోదరుడు ఇబ్రహీం ఫిర్యాదు మేరకు ఫసియుద్దీన్, ఆయన భార్య హబీబాషేక్, పీఏ సప్తగిరితోపాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తన సోదరుడు ఇటీవల ఇంటి ఆధునీకరణ పనులు చేపట్టారని.. దీనితో డబ్బులు డిమాండ్ చేస్తూ వారు వేధించారని ఇబ్రహీం ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వేధింపులు తట్టుకోలేక సర్దార్ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. సర్దార్ మృతదేహాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

# ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఫుడ్ పాయిజన్..



హైదరాబాద్: (సందేశం టైమ్స్): ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ అవతరణ దినోత్సవం (జూన్2)రోజున ఫుడ్ పాయిజన్ ఘటన జరిగిందని తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ఈ ఘటనలో మొత్తం 92 మంది రోగులు ఫుడ్ పాయిజన్ కారణంగానే అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో అస్వస్థతకు గురైన బాధితులను మంత్రి దామోదర ఇవాళ(బుధవారం) పరామర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులతో మంత్రి మాట్లాడారు.ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఘటనపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మంత్రి దామోదర మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఆస్పత్రి డైట్ కాంట్రాక్టర్‌ను తొలగించాలని మంత్రి దామోదర ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. అస్వస్థతకు గురైన వారందరి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని చెప్పుకొచ్చారు. డైయిట్ కారణంగానే ఈ ఫుడ్ పాయిజాన్ జరిగినట్లుగా తెలుస్తోందని అన్నారు. ఆ రోజు ఒక స్వీట్ కూడా అదనంగా రోగులకు ఇచ్చారని వివరించారు మంత్రి దామోదర రాజనర్సింహ.అనారోగ్యం పాలైన వారిలో తీవ్రంగా ఉన్న 18 మందిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని మంత్రి దామోదర రాజనర్సింహ వివరించారు. మిగతా రోగులని గాంధీ, ఉస్మానియాతో పాటు మొత్తం ఆరు వైద్య బృందాలు పర్యవేక్షిస్తున్నాయని వెల్లడించారు. అనారోగ్యం పాలైన వారి ప్రాణాలకు ప్రమాదం లేదని.. వారు మరో రెండు రోజుల్లో కోలుకుంటారని వైద్యులు తెలిపారని చెప్పారు. ఇక్కడ డైట్ చూసుకునే కాంట్రాక్టర్ పనితీరు సైతం సరిగా లేదని సమాచారం అందిందని.. అతని కాంట్రాక్ట్ రద్దు చేశామని తెలిపారు మంత్రి దామోదర రాజనర్సింహ.జరిగిన ఘటనపై ఒక కమిటీని నియమించాయని తెలిపారు. కమిటీ రిపోర్టు రాగానే బాధ్యులపై చర్యలు ఉంటాయని అన్నారు. ఇప్పటికే ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని చెప్పారు. చనిపోయిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు. కరోనాపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి దామోదర రాజనరసింహ పేర్కొన్నారు.

# రెండు రోజుల్లో 32 శాతం రేషన్ పంపిణీ

## దివ్యాంగులు, వయోవృద్ధులకు ఐదో తేదీలోగా ఇళ్లవద్దకే సరుకులు

(సందేశం టైమ్స్): జిల్లాలోని రేషన్ డిపోల్లో రెండు రోజుల్లోనే 32 శాతం కార్డులకు సరుకులు పంపిణీ చేసినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఉదయం జీవీఎంసీ 84వ వార్డు కోట్నివీధి 15వ నంబరు రేషన్ షాపు పరిధిలో సరుకుల పంపిణీపై ఆమె ఆరా తీశారు. రేషన్ షాపులో తనిఖీలు నిర్వహించిన కలెక్టర్.. తూకంలో తేడాలు లేకుండా రేషన్ పంపిణీ చేయాలని డీలర్‌ను ఆదేశించారు. దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ గురించి తెలుసుకున్నారు. అనంతరం దివ్యాంగులు, వృద్ధులైన విరోతి నాగయ్యమ్మ, కోట నాగమ్మ, చిత్ర చంద్రమ్మ, బొడ్డు మంగవేణిల ఇళ్లకు వెళ్లి సరుకులు అందజేశారు. రేషన్ డిపోల ద్వారా సరుకుల పంపిణీపై స్థానికుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, జిల్లాలో 1069 రేషన్ షాపుల ద్వారా ప్రతి నెల ఐదు లక్షల 30 వేల కార్డుదారులకు సరుకులు పంపిణీ చేస్తామనిఇ చెప్పారు. ఒకటి, రెండు తేదీల్లో 32 శాతం



కార్డులకు రేషన్ పంపిణీ పూర్తయ్యిందని చెప్పారు. జిల్లాలో దివ్యాంగులు, ఇంటి నుంచి కదలలేని స్థితిలో ఉన్న వారు, 65 సంవత్సరాలు దాటిన వారు సుమారు 66 వేల మంది ఉన్నారని, ఐదో తేదీలోగా ఆయా రోజుల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల లోపు రేషన్ డీలర్లు వీరి ఇళ్ల వద్దకు వెళ్లి సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా సరఫరాల అధికారి కేవీఎస్ మూర్తి, తహసీల్దార్ బి.విజయ్‌కుమార్, తదితరులు పున్నారు.

# దివ్యదర్శనం టోకెన్ కౌంటర్లు ఎక్కడంటే..




తిరుపతి:(సందేశం టైమ్స్): తిరుమల లో భక్తుల రద్దీ కొనసాగుతోంది . వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారి దర్శనం కోసం తరలి వస్తున్నారు. ఈ క్రమంలో భక్తులతో కంపార్టుమెంట్లు అన్నీ నిండిపోయి క్యూలైన్లు వెలుపలకు వచ్చాయి. సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. దీంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మరోవైపు శ్రీవారి వారి దర్శనం కోసం మెట్ల మార్గంలో కాలినడకన వచ్చే భక్తుల కోసం టీటీడీ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు జారీ చేస్తున్న దివ్యదర్శనం టోకెన్ల కౌంటర్లను తాత్కాలికంగా అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్ కు తరలించనున్నట్లు తెలిపారు. ఈ కొత్త కౌంటర్లు ఈ నెల 6వ తేదీ సాయంత్రం నుంచి భక్తులకు అందుబాటులో ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.

# బొగ్గు లారీ బీభత్సం



## కారు, ఆటోను ఢీకొనడంతో నలుగురికి గాయాలు

## డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే ప్రమాదం

లంకెలపాలెం, (సందేశం టైమ్స్):జాతీయ రహదారిపై లంకెలపాలెం కూడలిలో ఉదయం బొగ్గు లోడుతో వెళుతున్న లారీ బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు, మరో ముగ్గురికి స్వల్పగాయాలు అయ్యాయి. ఇందుకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలావున్నాయి. గంగవరం పోర్టులో బొగ్గును లోడ్ చేసుకున్న లారీ అచ్యుతాపురం బయలుదేరింది. ఉదయం ఆరు గంటల సమయంలో లంకెలపాలెం కూడలి వద్దకు చేరిన లారీ.. ఫ్రీ లెఫ్ట్‌కు వెళ్లాలి. కానీ డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా నేరుగా వెళ్లి ముందు వెళుతున్న కారును, అనకాపల్లి నుంచి వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా డివైడర్‌పైన వున్న సిగ్నల్ లైట్లు, హైమాస్ట్ స్తంభాన్ని ఢీకొన్ని రెయిలింగ్ పైకి దూసుకుపోయింది. ఆటోలో ప్రయాణిస్తున్న అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఎన్.ఆదిలక్ష్మి, జి.దేముడమ్మ, ఎన్.నూకాలమ్మ, దొండకాడకు చెందిన ఆటో డ్రైవర్ సీతారాములకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆదిలక్ష్మికి తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. జనసంచారం లేని సమయంలో ప్రమాదం జరగడంతో ప్రాణనష్టం వాటిల్లలేదని, అదే మరో రెండు గంటల తరువాత జరిగి వుంటే పరిస్థితి మరోలా వుండేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్రేన్‌ను రప్పించి లారీని పక్కకు తీయించారు. ప్రమాదం కారణంగా కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అర్హులకు ఇంటిస్థలాలు ఇవ్వాలి: సీపీఐ

## ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్



గుత్తి, (సందేశం టైమ్స్) : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లను నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు నాయకులు, పేదలు ర్యాలీ నిర్వహించి.. అక్కడ ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, మండల కార్యదర్శి రామదాసు, పట్టణ కార్యదర్శి రాజు, నాయకులు పాల్గొన్నారు.

# కౌలు రైతులకు న్యాయం చేయాలి

## తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



విడపనకల్లు, (సందేశం టైమ్స్) : మండలంలోని కౌలు రైతులను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, వెంక టేశులు కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌలు రైతులు ముందు గానే కౌలు చెల్లించి పంటలు సాగు చేస్తున్నారని, పంటలు పండక పోతే కనీసం చేసిన కూలి కూడా రాకుండా నష్టపోతున్నారన్నారు. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసు కోవాలన్నారు. రైతుభరోసా, సబ్సిడీ విత్తనాలు, బ్యాంక్‌లో రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దారు చంద్రశేఖరయ్యకు ఇచ్చారు.

# జాబ్‌కార్డులు అందజేసిన అధికారులు



జమ్మలమడుగు, (సందేశం టైమ్స్): జమ్మలమడుగు ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీవాసులు జాబ్‌కార్డులు అందుకున్నట్లు తెలిపారు. వెంటనే జిల్లా అధికారులు స్థానిక సిబ్బందికి గట్టి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. వెంటనే ఎస్సీ కాలనీలో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు జాబ్‌కార్డుల విషయంలో సమస్య ఉందని, చెప్పినవారిని పిలిపించి వారికి ఆగమేఘాలపై జాబ్‌కార్డులు అందించారు. బుధవారం నుంచి ఎస్.ఉప్పలపాడు గ్రామంలో ఉపాధి హామీ పనులకు వెళ్లవచ్చని బాధితులందరికి జాబ్‌కార్డులు అందించినట్లు కడప డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. అందులో ఎస్.ఉప్పలపాడు గ్రామంలో కలెక్టర్‌కు చెప్పినవారే కాకుండా మొత్తం అయిదుగురికి జాబ్‌కార్డులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. లంక మేరీ, బత్తల సాలమ్మ, బత్తల మేరమ్మ, కొమ్మగాండ్ల జయమ్మ లంకా మేరీ, అనే అయిదుగురికి జాబ్‌కార్డులు ఇచ్చినట్లు వారికి వెంటనే పని కల్పిస్తామని బుధవారం ఉదయం నుంచి వారు పనిలో వెళ్లవచ్చని స్థానిక అధికారులకు ఆదేశించినట్లు జిల్లా అధికారి తెలిపారు.

# నిషేధిత గుట్కా విక్రయిస్తే చర్యలు

బెంజిసర్కిల్, (సందేశం టైమ్స్): పాఠశాల, కళాశాలలు ఉన్న ప్రాంతాలకు వంద మీటర్ల దూరంలోనే పొగాకు సంబంధిత ఉత్పత్తులు విక్రయించాలని ఏసీపీ కె. దామోదర్ ఆదేశించారు. మంగళవారం ఎన్ఎస్ఎం పాఠశాల ప్రాంతాల్లో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత గుట్కా విక్రయించిన పలువురిపై కేసులు నమోదు చేయాలని ఏసీపీ సూచించారు. పలువురు ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల సమీపంలో పొగాకు సంబంధించిన ఉత్పత్తులను విక్రయిస్తున్న ఏడు షాపులకు రూ.200 జరిమానా విధించామని, ఆయా ఉత్పత్తులను విక్రయించవద్దని హెచ్చరించినట్లు తెలిపారు. మాచవరం, గుణదల పరిధిలోని పలు ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాలకు సమీపంలో నిషేధిత గుట్కా, పొగాకు




విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్ఎస్ఎం రోడ్డులో డ్రోన్లతో పర్యవేక్షించారు. మైక్‌లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో పటమట సీఐ వల్లభనేని పవన్ కిషోర్, ఎస్ఐలు జి.రేవతి, హరికృష్ణ, దుర్గాదేవి పటమట స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# దళితులపై వివక్ష చూపితే ఉద్యమిస్తాం

కళ్యాణదుర్గం,(సందేశం టైమ్స్): దళితుల పట్ల వివక్ష చూపిస్తే పెద్దఎత్తున ఉద్యమిస్తామని దళిత ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. మండలంలోని బోరంపల్లిలో దళితులకు రేషన్‌షాపును



కేటాయిస్తే కొంతమంది వ్యతిరేకంగా మాట్లాడుతున్నారన్నారు. ఇలాగే చేస్తే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

# కుక్కలను చంపినవారిపై కేసు

ఏలూరు (సందేశం టైమ్స్): ఫారమ్ వద్ద కుక్కలు కోళ్లను తింటున్నాయనే కారణంతో ఇద్దరు వ్యక్తులను తీసుకొచ్చి 9 కుక్కలను హతమార్చిన సంఘటనపై ఏలూరు త్రిటౌన్ పోలీసులు కేసు నమో దు చేశారు. కాకినాడకు చెందిన సూరాబత్తుల గోపాలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ నెల 27న సాయంత్రం 4.30 గంటలకు శనివారంపుపేట ఏటిగట్టు శివారు ప్రాం తంలో ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి తుపాకీతో ఆ ప్రాం తంలో ఉన్న 9కుక్కలను హతమార్చి వెళ్లిపోయారు. అంతేకాకుండా ప్రశ్నించిన కుక్కల యజమానులను బెదిరించారు. ఈ సంఘటనను 'మే నెల 30న వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో పోలీస్ అధికారులు నిఘా పెట్టారు. కాకినాడకు చెందిన జంతు సం రక్షణ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి సూరాబత్తుల గోపాలరావు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టారు. రెండ్రోజుల్లో నిందితులను అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. ఇప్పటికే నిందితులను గుర్తించినట్లు సమాచారం.

# ఒకేషనల్ జూనియర్ కళాశాల తనిఖీ



కర్నూలు (సందేశం టైమ్స్) : స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలను జిల్లా వృత్తి విద్యాధికారి సురేష్‌బాబు తనిఖీ చేశారు. 2025-26 విద్యాసంవత్సరా నికి సంబంధించి కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలని, సమయ పాలన పాటిస్తూ వార్షిక ప్రణాళిక ప్రకారం విద్యాబోధన చేయాలని అధ్యాపకులకు సూచించారు. విద్యార్థులతో యోగాసనాలు, మెడిటేషన చేయిస్తూ సృజనాత్మకతను పెంచడానికి కృషి చేయాలన్నారు. కళాశా లలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యాదీవెన పథకంలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా సప్లయ్ చేస్తున్న పాఠ్యపుస్తకాలను డీవీ ఈవో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్, అధ్యాపకులు ప్రసన్న కుమార్, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున పాల్గొన్నారు.

# కళ్లకు గంతలతో నిరసన



(సందేశం టైమ్స్): సామర్లకోట, పెద్దాపురం తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా జరిగుతున్న సమ్మె శిబిరంలో కార్మికులు రోజుకో రూపంలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనిలోభాగంగా కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించేంత వరకూ సమ్మె జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కొండవీటి రామరాజు, ఉపాధ్యక్షులు కృష్ణ, నాయకులు మేడిపోయిన రమణ, రత్నరాజు, రమేష్, కురుకూరి మురళీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మున్సిపాలిటీ వద్ద మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 28వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజనీరింగ్ కార్మికులు నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సుంకర నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు బాసిన భద్ర రావు, కె.వెంకటరమణ, ఆకుల రామకృష్ణ, వాకాడ భాస్కర్, ప్రశాంత్, ఎన్.సూర్యప్రకాష్, మహపాతిన పాపారావు, ఎస్‌కె.బషీర్, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో పడకేసిన పారిశుధ్యం

(సందేశం టైమ్స్): నగర పంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. 20 వార్డులు ఉన్న ఏలేశ్వరం పేరుకే నగర పంచాయతి. నగర పంచాయతీగా గుర్తింపు పొందినా కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఇళ్లలోంచి వచ్చే వ్యర్థ నీరు పోయేందుకు ఉన్న మురుగు కాలువలు పూడికతో నిండిపోయాయి. ప్రతి వార్డులోనూ మురుగు కాలువలు పూడికితో మూసిపోవడంతో మురుగునీరు ముందుకు పోయే పరిస్థితి కన్పించడం లేదు. కాలువల్లో పూడికను తొలగించకపోవడంతో పందులు దొర్లడంతో మురుగు కుంటలుగా మారిపోతున్నాయి. దీంతో దోమలు, ఈగలు పెరిగిపోయి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంచాయతీలోని 20 వార్డులో ఎక్కడ చూసినా మురుగు కాలువలు ఇలానే దర్శనమిస్తున్నాయి. వర్షం వస్తే చాలు మురికి నీరు రోడ్లపై పొంగిపొర్లుతుంది.

# కాళ్లు, చేతులు కట్టేసి దోపిడీ

- దోపిడీ జరిగిన మారుతీ షోరూమును పరిశీలిస్తున్న పోలీసులు
- తిరుపతిలోని కార్ల షోరూంలో రూ.7 లక్షల అపహరణ
- ఘటనా స్థలం పరిశీలించిన పోలీసు బృందాలు
- ఉత్తరాది ముఠాగా అనుమానం
- మూడు బృందాలు ఏర్పాటు చేసిన ఎస్పీ



తిరుపతి(సందేశం టైమ్స్) : కాళ్లు, చేతులు కట్టేశారు. షోరూములోని రూ.7 లక్షలు దోపిడీ చేసుకెళ్లారు. ఈ ఘటన తిరుపతి నగరం రేణిగుంట రోడ్డులోని భార్గవి ఆటోమొబైల్స్ (మారుతీ షోరూం)లో తెల్లవారుజామున చోటుచేసుకుంది. క్రైం పోలీసుల కథనం మేరకు.. ముఖాలకు ముసుగు వేసుకున్న నలుగురు యువకులు తెల్లవారుజామున షోరూమ్‌లోకి ప్రవేశించారు. లోపలున్న సేల్స్ ఎగ్జిక్యూటివ్ బాలాజీ చేతులు, కాళ్ళు కట్టేశారు. మేనేజర్ రూములోకి చొరబడ్డారు. అక్కడ రూ.7 లక్షలున్న చిన్న లాకర్ తీసుకెళ్లారు. ఆ తర్వాత కట్లు విడిపించుకుని బాలాజీ పోలీసులకు సమాచారం అందించారు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు, క్రైం డీఎస్పీ శ్యాంసుందర్, తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం, సీఐలు రాంకిషోర్, శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆ నలుగురు దొంగలకు 25 నుంచి 35 ఏళ్లు ఉంటాయి. వీరు హౌస్ బ్రేకింగ్‌లో ఆరితేరిన వారు. ఈ నలుగురు రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వచ్చి షోరూమ్ వెనుక వైపు నుంచి లోపలకు ప్రవేశించినట్లు భావిస్తున్నారు. హిందీ స్పష్టంగా మాట్లాడుతుండటంతో.. ఉత్తరాదికి చెందిన ముఠాగా అనుమానిస్తున్నారు. పరిసరాల్లో తనిఖీ చేసిన పోలీసులకు రైల్వే ట్రాక్‌పై పగులకొట్టి ఉన్న లాకర్ కనిపించగా దాన్ని సీజ్ చేశారు. షోరూములోని ముఖ్యప్రాంతాల్లో వేలి ముద్రల నిపుణలు వేలి ముద్రలు సేకరించారు. పాత నేరస్థుల వేలిముద్రలను పరిశీలించి.. ఈ ఘటన వెనుక వున్న దోపిడీ ముఠా ఎవరై ఉంటారనే కోణంలో దర్యాప్తు సాగించనున్నారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. అక్కడ వున్న సీసీ కెమెరాలు పరిశీలించి పుటేజీ సేకరించారు. తిరుపతి క్రైం సీఐ శివకుమార్ రెడ్డి కేసు నమోదు చేశారు. కాగా, దామినేడు వద్ద ఉన్న ఓ కారు షోరూములోనూ సోమవారం వేకువజామున చోరీకి యత్నించి సెక్యూరిటీని నిర్బంధించారు. ఈ దోపిడీ ఘటనల నేపథ్యంలో ఎస్పీ హర్షవర్ధనరాజు సీరియస్‌గా స్పందించారు. అనుమానం వున్న వారి కోసం మూడు పోలీసు బృందాలను నియమించారు. వీరు తిరుమల, తిరుపతి, చెన్నైతో పాటు విజయవాడ, హైదరాబాదుకు వెళ్ళినట్లు తెలిసింది. ప్రసాద్, భక్తవత్సలం, శ్యాంసుందర్‌తో ఎస్పీ హర్షవర్ధనరాజు తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. దోపిడీ దొంగల ఆచూకీ గుర్తించి అరెస్టు చేయాలని క్రైం పోలీసులను ఆదేశించారు. గతంలో సీపీఆర్ విల్లాసలో జరిగిన దొంగతనాలపైనా సమీక్ష చేసిన ఎస్పీ.. ఆ కేసు ఎంత వరకు వచ్చిందని ఆరా తీశారు. ఎస్పీ అడిగిన ప్రశ్నలకు కొందరు పోలీసు అధికారులు నోరు మెదపనట్లు తెలిసింది. స్మార్ట్ వర్కు చేసి ఫలితాలు రాబట్టాలని సూచించారు.

# పిల్లలకు ఏం చెప్పాలి..లేవండిరా!



రాజమహేంద్రవరం (సందేశం టైమ్స్) : పిల్లలకు ఏం చెప్పాలి.. లేవండి.. ఇంటికి వెళ్లిపోదాం.. అరగంటలో వచ్చేస్తున్నాం అన్నారు... ఇలా చేశారేంటిరా.. నీ ఇద్దరి పిల్లలకు ఏం చెప్పమంటావ్.. నిన్నటి నుంచి అమ్మా నాన్నా ఎక్కడ అంటూ అడుగుతూనే ఉన్నారు.. ఏం చేయాలిరా.. దేవుడా ఎంత పనిచేశావ్.. మాకు ఇంత అన్యాయం చేస్తావా అంటూ బంధువులు ఐదుగురి మృతదేహాలను పట్టుకుని రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.. రఘునాథపురం, పిడింగొయ్యి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.. ఊరు కన్నీళ్లు పెట్టింది.. నిన్నటి వరకూ తమ మధ్య ఆనందంగా తిరిగివాళ్లు విగత జీవులుగా కనిపించడం చూసి.. ఊరుజనం.. స్నేహితులు.. బంధు వులు అంతా ఏడుస్తూ లేవండి అంటూ తట్టి లేపుతూనే ఉన్నారు.. అయినా కదలిక లేదు.. దేవుడా ఎంత పనిచేశావ్ అంటూ బంధు వులు మృతదేహాలను పట్టుకుని రోదించిన తీరు చూపరులకు కంట తడి పెట్టించింది. ఇదీ రాజానగరం మండలం రఘు నాథ పురం మండలంలో మంగళవారం కనిపించిన విషాదం. రంగంపేట మం డలం వడిశలేరు వద్ద సాయంత్రం జరిగిన ప్రమా దంలో మరణించిన రేలంగి శివన్నారాయరణ (40), భార్య రేలంగి శ్రీదేవి (34), కుమార్తె వర్షిత (13), బావమరిది తీగిరెడ్డి శివ (30), కుమార్తె సాన్వి(4) మృతదేహాలకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు. దీంతో ఆసుపత్రి వద్ద రోదనలు మిన్నం టాయి. దేవుడా మాకు అన్యాయం చేశావంటూ బంధువులు రోదిం చిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఐదు పార్థివదేహాలను స్వగ్రామం రఘునాథపురం తరలించి కార్యక్రమాలు పూర్తిచేశారు. అనంతరం రాజమహేంద్రవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. పార్థివదేహాలకు మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, జక్కంపూడి విజయలక్ష్మి నివాళులర్పించారు. ప్రమాదంలో ప్రాణాలతో బయటపడ్డ తీగిరెడ్డి భవాని, రేలంగి హర్షిత చికిత్సపొందుతున్నారు. ప్రమాధ సంఘటనలో తమ వారు మరణించిన విషయం కూడాగాయపడిన ఇద్దరికి తెలియని పరిస్థితి . ఈ విషయాన్నివారికి ఎలా చెప్పాలో అర్థంకాని స్థితిలో రెండు కుటుంభాలకు చెందిన బందువులు గుండెలు బాదుకుటుంన్నారు.

# వ్యక్తి ప్రాణాలు రక్షించిన పుట్టపర్తి పోలీసులు




పుట్టపర్తి (సందేశం టైమ్స్): కుటుంబ కలహాలతో చిత్రావతి నదిలో దూకి ఆత్మహత్య చేసుకోబోయిన వ్యక్తి ప్రాణాలను పుట్టపర్తి పోలీసులు రక్షించారు. రాత్రి పుట్టపర్తిలో నివాసం ఉంటున్న కలకత్తాకు చెందిన రాజేష్ శర్మ అను వ్యక్తి ఆత్మహత్య చేసుకునేందుకు చిత్రావతి నదిలో దూకాడు. అయితే ఆ ప్రాంతంలో ఉన్న కొందరు యువకులు, చిత్రావతిలో దూకిన వ్యక్తి సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని నీటి మధ్యలో మునుగుతూ తేలుతూ ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న రాజేష్ శర్మను తన సిబ్బంది అక్కడ ఉన్న యువకుల సహకారంతో రక్షించారు. బోటులో వెళ్లి నది మధ్యలో ఉన్న రాజేష్ శర్మను బయటికి తీసుకువచ్చారు. అతనిని పోలీస్ స్టేషన్ తీసుకువెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. తమ వారిని కాపాడి ప్రాణాలు రక్షించిన పోలీసులకు, పట్టణ యువకులకు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఒక వ్యక్తి ప్రాణాలను రక్షించడంలో వెంటనే స్పందించిన పోలీసుల తీరుపై పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006